క్లుప్తంగా

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి



తవ్వా కృష్ణ, ఏఎస్‌వో గాజువాక సర్కిల్-3

పెదగంట్యాడ: రేషన్ కార్డుదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని పౌరసరఫరాల శాఖ సర్కిల్-3 ఏఎస్‌వో తవ్వా కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గాజువాక సర్కిల్-3 పరిధిలో 44877 మంది ఈకేవైసీ చేయించుకోలేదని వీరంతా ఈ నెల 30వ తేదీ లోగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. లేదంటే ఆ సభ్యుడి పేరును రేషన్ కార్డు నుంచి తొలగించి రేషన్ నిలిపివేస్తారని పేర్కొన్నారు. ఈకేవైసీ చేయించుకోని వ్యక్తుల జాబితా రేషన్ డీలర్లు, వీఆర్వోల వద్ద ఉందని.. వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

క్విజ్ విజేతలకు అభినందన



పారితోషికం పొందిన విద్యార్థులతో కళాశాల పిన్సిపాల్ శ్రీనివాసరావు

అగనంపూడి: జాతీయ స్థాయి ఫార్మా క్విజ్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఫార్మాస్యూటికల్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి దక్కించుకున్నారు. ఫార్మా విద్యా రంగంపై భీమవరంలోని శ్రీ విష్ణు ఫార్మా కళాశాలలో జాతీయ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా (4వ సంవత్సర) విద్యార్థులు అల్లు పుష్ప, మాణిక్యం సాయి శ్రీవాణిలు ఉత్తమ ప్రతిభ కనపర్చి ప్రథమ బహుమతి దక్కించుకున్నారు. ఈమేరకు కళాశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ కమల కుమారి, ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఇన్‌చార్జి వసుధ పాల్గొన్నారు.

నేడు స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

ఉక్కునగరం: ఉద్యోగులకు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు. హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని, టౌన్‌షిప్‌లో పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలన్న డిమాండ్లపై ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, ప్రధానకార్యదర్శి యు.రామస్వామి కోరారు.

పీఎఫ్ బకాయిలు చెల్లించాలని లేఖ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పీఎఫ్ ట్రస్ట్‌కు యాజమాన్యం వెంటనే బకాయిలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఉక్కు యాజమాన్యానికి లేఖ అందజేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఎనిమిది నెలలగా పీఎఫ్ ట్రస్ట్‌కు చెల్లింపులు నిలిపి వేయడంతో ఆ బకాయిలు రూ. 500 కోట్లకు చేరాయని పేర్కొన్నారు. ఉద్యోగులు పీఎఫ్ రుణాలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు 5700 మంది హయ్యర్ పెన్షన్ డిమాండ్ లెటర్లు అందుకున్నారని.. వారి పీఎఫ్ సొమ్మును ఈపీఎఫ్‌వోకు చెల్లించాల్సి ఉందన్నారు. అదే విధంగా యాజమాన్యం ఆమోదించిన 1100 మంది వీఆర్ఎస్ ఉద్యోగులకు పీఎఫ్ ఫైనల్ పేమెంట్లు చేయాల్సి ఉందన్నారు. వెంటనే యాజమాన్యం పీఎఫ్ ట్రస్ట్‌కు చెల్లింపులు చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, అధ్యక్షులు వై.టి. దాస్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి లేఖలో కోరారు.

మర్యాదపూర్వక కలయిక



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు జాబితా అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

విశాఖ విద్య: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కమిటీ ఏర్పాటైన నేపథ్యంలో బుధవారం జిల్లా బాధ్యులంతా కలసి డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్ విజయవంతమయ్యేలా సంఘం పూర్తి స్థాయిలో సహకరిస్తుందన్నారు. సమస్యల పరిష్కారంలో ఉపాధ్యాయుల పక్షాన నిలిచి, వాటి పరిష్కారం కోసమని ప్రాతినిధ్యం వహిస్తామని, ఇందుకు జిల్లా విద్యా శాఖాధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, సహాధ్యక్షుడు, విశాఖ నగర అధ్యక్షుడు సుదర్శన్ పట్నాయక్, కోశాధికారి కె.సన్యాసినాయుడు తదితరులున్నారు.

సర్వేలతో గుబులు!



ఇంటింటి సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది



సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



పీ-4 సర్వేలో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

పీ-4 సర్వేలో 27 ప్రశ్నలకు సమాధానాల సేకరణ

వివరాలు చెప్పడానికి జంకుతున్న జనం

పథకాలు తీసేస్తారేమోనని ప్రజల్లో ఆందోళన

మరో వైపు గడువులోగా పూర్తి చేయాలని సిబ్బందిపై ఒత్తిడి

పెదగంట్యాడ: మండలంలో ప్రస్తుతం చేపట్టిన పీ-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వే ప్రజల గుండెల్లో గుబులు రేపుతోంది. సచివాలయ సిబ్బందిని ఒత్తిడికి గురిచేస్తోంది. పేదలకు ఆర్థికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సర్వే నిర్వహిస్తోందని అధికార యంత్రాంగం చెబుతున్నా ప్రజల్లో ఆందోళన నెలకొంది. సచివాలయ సిబ్బంది సర్వే పేరుతో ఇంటింటికి వెళ్లి అడుగుతున్న ప్రశ్నలకు ప్రజలు కంగుతింటున్నారు. సంక్షేమ పథకాలు ఏరివేతకేనా ఇటువంటి ప్రశ్నలు వేస్తున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. సర్వేపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు కూడా విఫలమవుతున్నారు.

ప్రశ్నలే.. ప్రశ్నలు

సచివాలయ సిబ్బంది క్లస్టర్ వారీగా ఆయా కుటుంబాల నుంచి సామాజిక, ఆర్థిక స్థితిగతులను 27 ప్రశ్నల ఆధారంగా సమాచారం నమోదు చేస్తున్నారు. కుటుంబ యజమాని పేరు. ఆధార్, బ్యాంక్ ఖాతా, ఇంట్లో టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, ఏసీ, ల్యాప్‌టాప్ ఉన్నాయా వంటి అంశాలను ఆరా తీస్తున్నారు. ఇంట్లో ఎంతమంది సంపాదిస్తున్నారు.. ఉద్యోగం చేస్తున్నారా, ఆస్తులు, ఆదాయం, ఇన్‌కమ్‌టాక్స్, బైక్, కారు ఉన్నాయా.. వంట గ్యాస్, నెలకు ఎంత కరెంటు బిల్లు వస్తుంది.. కుళాయి కనెక్షన్, కుటుంబ సభ్యుల నెలసరి ఆదాయం, డిగ్రీ ఆపై చదివిన వారి వివరాలు, కుటుంబ నెలవారీ ఖర్చు తదితర ప్రశ్నలు వేస్తుండంతో ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయి. మరో వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏమైనా పథకాలు అందుతున్నాయా అనే వివరాలు సేకరించి వాటిని సచివాలయాలకు అనుసంధానం చేస్తున్నారు.

ఓటీపీ చెప్పాలా...

అసలే బ్యాంక్ ఖాతాలో డబ్బులు కాజేసేందుకు ఎన్నో సైబర్ క్రైంలు సాగుతున్న నేపథ్యంలో ఇలా మాటిమాటికి ఇళ్ల వద్దకు వచ్చి ఆధార్ చూపండి.. సెల్‌లో ఓటీపీ వచ్చిందా దాన్ని చెప్పడంటూ తమ వ్యక్తిగత గోప్యతకు భద్రత లేకుండా పోయిందని జనం ప్రశ్నిస్తున్నారు. దీంతో పూర్తి స్థాయిలో సర్వే చేయలేక సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతుంటే.. అధికారులేమో చెప్పిన సమయానికి సర్వే పూర్తి కావాలని గట్టిగా ఆదేశాలు ఇస్తున్నారని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. దీంతో వివరాలు సేకరించడం సచివాలయ సిబ్బందికి పెద్ద తలనొప్పిగా మారింది.

ఇంటికి వెళ్లేదెప్పుడు

సచివాలయ సిబ్బందికి ఎన్నో తిప్పలు. అధికారులు ఉదయం 10.30 గంటలకు కార్యాలయాలకు వచ్చి సాయంత్రం 5 గంటలకు ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మా సచివాలయ సిబ్బందికి మాత్రం వేళాపాలా లేకుండా విధులు అప్పగిస్తున్నారని... ఇంకా ఎన్ని సర్వేలు చేయాలో అని సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తూ లోలోపలే మథనపడుతున్నారు.

వివరాలు చెప్పేందుకు నిరాకరణ

మండల పరిధిలో పలు ప్రాంతాల్లో కొన్ని కుటుంబాలు వ్యక్తిగత వివరాల సేకరణలో సచివాలయ సిబ్బందికి ప్రజల నుంచి సహకారం కొరవడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి పథకాలు అందించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే సంక్షేమ పథకాల లబ్ధిదారులను తగ్గించడం ప్రారంభించింది. పింఛన్లలో కోత, కొత్తవి మంజూరు ఎండమావిగా మారింది. ఇప్పుడు పీ-4 సర్వే పేరిట వివరాలు అడుగుతుంటే వారిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలు దూరం చేసేందుకు ఈ వివరాలు సేకరిస్తున్నారని సిబ్బందిపై మండిపడుతున్నారు. వివరాలు చెప్పేందుకు చాలా మంది నిరాకరిస్తున్నారు. దీంతో చేసేదిలేక సచివాలయ సిబ్బంది వారికి తెలిసిన సమాచారం రాసుకుని వెళ్తున్నారు .

ఐటీఐ చేసిన వారికి ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

పెదగంట్యాడ: ఐటీఐ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు ప్రాజెక్ట్ ఇన్నోవేషన్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు 30 ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రదర్శలను పరిశీలించిన రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్. రమణ, టాటా ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ బధ్వాల్కర్, గాజువాక ఐటీఐ ఐఎంసీ చైర్మన్ ఏకే బాలాజీ విజేతలను ప్రకటించారు. విజేతలకు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు, ఆర్ శ్రీనివాసరావు, వివిధ ఐటీఐలకు చెందిన ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్ట్ సభ్యుడు నరేష్‌కుమార్‌కు సత్కారం



నరేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న పీఎఫ్ ట్రస్ట్ చైర్మన్, కార్యదర్శి, ట్రస్టీలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ట్రస్ట్ సభ్యుడు, ఏఐటీయూసీ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ జె. నరేష్‌కుమార్‌ను బుధవారం సత్కరించారు. నరేష్‌కుమార్ స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఫైనాన్స్ పే సెక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఝూ, ట్రస్ట్ కార్యదర్శి ఎస్. రామ్‌ప్రసాద్, ట్రస్ట్ సభ్యులు చీకటి శ్రీనివాసరావు, రామచంద్రరాజు, షైనిబాబులు నరేష్‌కుమార్‌కు శాలువా కప్పి, బొకేతో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేష్‌కుమార్ పీఎఫ్ ట్రస్టీగా ట్రస్ట్ అభివృద్ధికి ఎనలేని సేవలందించారన్నారు. కార్యక్రమంలో పే సెక్షన్ ఉద్యోగులు సాయిప్రసాద్, రాణా, రమేష్, స్వాతి, ప్రసాద్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతంగా స్థిరపడడానికి అపార అవకాశాలు



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

గాజువాక: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో ఉన్నతంగా స్థిరపడడానికి విస్తృత అవకాశాలున్నాయని ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు అన్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన పీజీ విద్యార్థుల ఫేర్‌వెల్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలని, మంచి రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. రెడ్డీస్ ల్యాబ్స్ హెచ్‌ఆర్ హెడ్ వి.జగన్నాథన్ మాట్లాడుతూ ప్రస్తుతం విస్తృతంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడంతోపాటు సాంకేతికతను జోడించి ఉన్నతంగా ఎదగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ ఫార్మారంగంలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని, దానికనుగుణంగా విద్యార్థులు ప్రతిభ కనబరచాలన్నారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాధిపతులు వి.తేజేశ్వరరావు, వై.ఈశ్వరరాజు, ఎస్.వి.కృష్ణ, రామ్ తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



భెల్ గేటు వద్ద సహాయ నిధిని సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

గాజువాక: క్యూబాకు అండగా నిలబడడం కోసం భెల్ సీఐటీయూ నాయకులు బుధవారం విరాళాలు సేకరించారు. సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఆ యూనియన్ భెల్ నాయకులు సంస్థ మెయిన్ గేటు వద్ద కార్మికులు, ఉద్యోగుల నుంచి సహాయ నిధిని సేకరించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ అమెరికా ఖండంలో క్యూబా ఏకైక సోషలిస్టు దేశమని, కోటీ ఇరవై లక్షల మంది జనాభా ఉన్న ఈ దేశాన్ని అమెరికా అన్ని విధాలా ఇబ్బంది పెడుతోందని అన్నారు. 1991 తర్వాత అమెరికా ఆంక్షల వల్ల క్యూబాలో పసిబిడ్డలకు పాల పొడిగాని, అవసరమైన మందులు కూడా అందని వ్వడం లేదని అన్నారు. కోవిడ్ సమయంలో 52 దేశాలకు క్యూబా అన్ని విధాల సహాయం చేసిందన్నారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ దేశాన్ని ఆదుకోవడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.జగన్నాథరావు, కె.విజయ్‌కుమార్, కె.నారప రెడ్డి, ఆల్సి అప్పలనాయుడు, సీహెచ్.మురళీశ్వర రావు, జి.అచ్చన్నాయుడు, ఎస్.అప్పారావు, జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు పూర్తిస్థాయి సీఎండీని నియమించండి

కేంద్ర ఉక్కుమంత్రికి పోరాట కమిటీ లేఖ

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పూర్తి స్థాయి సీఎండీని నియమించాలని కోరుతూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి లేఖ రాశారు. స్టీల్‌ప్లాంట్‌కు రూ.11, 440 కోట్లు ప్యాకేజీ ప్రకటించడం వల్ల రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు నిరాటంకంగా పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయన్నారు ఇన్‌చార్జ్ సీఎండీ పూర్తి స్థాయిలో ప్లాంట్ నిర్వహణపై దృష్టి సారించలేక పోతున్నారని పేర్కొన్నారు. తద్వారా విధాన నిర్ణయాలతో పాటు కార్మిక సంక్షేమంపై నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీ సద్వినియోగం కావాలంటే ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో పర్యవేక్షించే సీఎండీ అవసరం అని వివరించారు. ఇప్పటికే సీఎండీగా ఎంపికైన వ్యక్తిని నియమించాలని పోరాట కమిటీ చైర్మన్లు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సీహెచ్ నర్సింగరావు ఆ లేఖలో పేర్కొన్నారు.

ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్స్‌లో నిర్వహించిన ఈ తరంగ్-2025 ఫెస్ట్‌లో భాగంగా జరిగిన ఆర్ట్ పోటీల్లో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. డిపార్ట్‌మెంట్ విద్యార్థులు ఏడు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు అభినందించారు. శతాబ్ది ఉత్సవాల్లో చిత్రకళా విభాగం విద్యార్థులు తమ కళా ప్రతిభతో ఆకట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు వేదిక హ్యాక్‌థాన్



హ్యాక్‌థాన్‌లో పాల్గొన్న విద్యార్థి బృందాలు

అగనంపూడి: సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలకు హ్యాక్‌థాన్ చక్కటి వేదికగా నిలుస్తుందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల, ఉమెన్ టెక్ మేకర్స్ సంయుక్తంగా నిర్వహించిన 24 గంటల హ్యాక్‌థాన్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డేటా సైన్స్, ప్రోగ్రామింగ్ అంశాలపై మౌలిక ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యంతో పోటీ పడాలనే విద్యార్థులకు హ్యాక్‌థాన్ ఎంతో దోహదపడుతుందన్నారు. 60 జట్లు పాల్గొన్న విద్యార్థులకు వివిధ రౌండ్లలో పోటీలు నిర్వహించగా ముగ్గురు విజేతలుగా నిలిచారన్నారు. మొదటి బహుమతిగా రూ.పదివేలు, తరువాత స్థానాల్లో నిలిచిన వారికి రూ.7500, 5000 నగదు అందించారు. కంప్యూటర్ సైన్స్, అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ సైన్స్ విభాగాల అధిపతులు దినేష్‌రెడ్డి, స్వాతి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



వెంకట పవన్ కుమార్(ఫైల్)

పెదగంట్యాడ: మండలంలోని వాంబే కాలనీలో ఓ యువకుడు బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాంబే కాలనీలో దేరింగు వెంకట పవన్ కుమార్ (28) తల్లి, తమ్ముడితో కలసి నివాసం ఉంటున్నాడు. ఇంటర్ వరకు చదువుకున్నాడు. డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం ఖాళీగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా మనస్తాపం చెందిన ఆ యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నజీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాంగణ నియామకాలతో విద్యార్థులకు తోడ్పాటు



సంస్థ ప్రతినిధులను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వసుధ ఫార్మ కెమ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తోంది. ఎంఎస్సీ కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్, ఎం.ఫార్మసీ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఈ ప్రాంగణ నియామకాల్లో అవకాశాలు కల్పిస్తున్నారు. రీసెర్చ్ డెవలప్‌మెంట్ ప్రొడక్షన్ క్వాలిటీ కంట్రోల్ తదితర విభాగాలకు విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. దీనిలో భాగంగా సంస్థ ఆపరేషన్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.కిషోర్‌కృష్ణ, కార్పొరేట్ హెచ్‌ఆర్ సి.హెచ్.ఎస్ రామశర్మలతో కూడిన నిపుణుల బృందం బుధవారం ఏయూకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఏయూ తరఫున వీరిని రిజిస్ట్రార్ సత్కరించారు. ప్రాంగణ నియామకాలను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులకు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్స్-కార్పొరేట్ రిలేషన్స్ డైరెక్టర్ వి.ఆర్.రెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ పి.మోహన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు.

భారీ ఆక్రమణ తొలగింపు

వెల్లువలా ఫిర్యాదులు రావడంతో స్పందించిన అధికారులు



రెవెన్యూ అధికారులు తొలగించిన అక్రమ నిర్మాణం

పెదగంట్యాడ: భూ ఆక్రమణపై మరోసారి రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలోని దయాల్‌నగర్ ప్రాంతం వికాస్‌నగర్ జంక్షన్‌కు ఎదురుగా బీసీ రోడ్డుకు ఆనుకొని సర్వే నెంబర్ 43/1లో ప్రభుత్వ స్థలం ఉంది. ఆ స్థలం పక్కనే ఉన్న జిరాయితీ స్థలాన్ని ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు. ఇదే అదునుగా భావించి అతని స్థలానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలం 156 చదరపు గజాలు ఆక్రమించేశాడు. అక్కడితో ఆగకుండా పెద్ద ఎత్తున నిర్మాణం చేపట్టాడు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న మండల రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించారు. సర్వే చేసి అందులో ప్రభుత్వ భూమి ఉండడంతో అందులో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని గత నెల 23న తొలగించారు. అయితే ఆక్రమణదారుడు మాత్రం అధికారుల ఆదేశాలను పక్కన పెట్టేశాడు. ఓ కార్పొరేటర్ అండతో మళ్లీ నిర్మాణం ప్రారంభించారు. చకచకా పనులు చేపట్టాడు. ఈ నేపథ్యంలో మరోసారి ఫిర్యాదులు అందుకున్న రెవెన్యూ అధికారులు ఆక్రమణదారునికి నోటీసులు ఇచ్చారు. ఆపై ఆక్రమణను బుధవారం తొలగించారు.

65వ వార్డు కార్పొరేటర్ అత్యుత్సాహం

కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్కడ నిర్మాణం చేపట్టడంతో అధికారులు బుధవారం తొలగించేందుకు ప్రయత్నం చేస్తుంటే 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు (కేబుల్ మూర్తి) అత్యుత్సాహం ప్రదర్శించారు. రెవెన్యూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అధికారులపై చిందులు తొక్కారు. అయితే రెవెన్యూ అధికారులు ఒత్తిడికి తలొగ్గకుండా ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాన్ని తొలగించారు. మరోసారి నిర్మాణం చేపడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్లాన్ రెసిడెన్షియల్.. నిర్మాణం కమర్షియల్

దయాల్‌నగర్ ఏరియా బీసీ రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థలంలో రెసిడెన్షియల్ ప్లాన్ తీసుకుని కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. మామూళ్ల మత్తులో పడి ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే రెవెన్యూ అధికారులు సదరు స్థలంలో చేపట్టిన నిర్మాణాన్ని తొలగించేందుకు సిద్ధం కావడంతో అప్రమత్తమైన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అప్పటికప్పుడు నోటీసు సిద్ధం చేశారు. ఆ నోటీసు సదరు నిర్మాణానికి అతికించి చేతులు దులుపుకున్నారు.